క్లుప్తంగా

ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆరా



శాంతిరాంలో వసతులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జగదీష్‌చంద్రారెడ్డి

పాణ్యం:దేశంలో కోవిడ్ కేసులు నమోదవుతున్న తరుణంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వైద్యశాఖ అధికారులు సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. నంద్యాల జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జగదీష్‌చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలు ఆసుపత్రులను పరిశీలించారు. ముఖ్యంగా కోవిడ్ రోగులకు అందించాల్సిన సౌకర్యాలు, అందుకు అవసరమైన పరికరాలపై ఆరా తీశారు. ప్రథమ చికిత్స మొదలుకొని అత్యవసర చికిత్స వరకు అవసరమైన వసతుల గురించి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. ఇలా జిల్లాలోని ప్రతి ఆసుపత్రిలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జునరెడ్డి, శాంతిరాం ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

గడివేముల: మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్య రా కుండా చూడాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప పంచాయతీ కార్యదర్శులకు చెప్పారు. గత కొన్ని రోజులుగా ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయసింహారెడ్డి దీర్ఘకాలిక సెలవులపై వెళ్లారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు సంజామల ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న శివమల్లేశ్వరప్పను ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈనేపథ్యంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించి పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. అనంతరం గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అబ్దుల్‌ఖాలీక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

గడివేముల: ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు తీసుకొచ్చిందని తలముడిపి వైద్యాధికారి డాక్టర్ కిరణ్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని ఒండుట్ల గ్రామంలోని సచివాలయం వద్ద ప్రజలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది,ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

తవ్వకాలను అరికట్టండి

ఓర్వకల్లు: తమ భూముల్లో విద్యుత్ టవర్ల ఏర్పాటు కోసం అక్రమంగా చేపట్టిన తవ్వకాలను అరికట్టాలని బాధిత రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,మండలంలోని తిప్పాయపల్లె, హుసేనాపురం, ఓర్వకల్లు గ్రామాల్లో ఎలాంటి అనుమతి లేకుండా గ్రీన్‌కో సంస్థ విద్యుత్ టవర్ల ఏర్పాటు కోసం గోతులు తవ్వడం అన్యాయమన్నారు. దీని వల్ల తమ భూముల విలువ పడిపోవడమే కాక పంట సాగుకు ఇబ్బందవుతుందని చెప్పారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డికి, ఎస్‌ఐ మల్లికార్జునకు వినతి పత్రాలు సమర్పించారు.

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

గూడూరు రూరల్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సన సూచించారు.పెంచికలపాడులో సోమవారం తాగునీటి పథకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందు జాగ్రత్తగా గ్రామాల్లో చేతి పంపులు, బోర్లు, పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేపట్టామన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం



సి.బెళగల్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ఎంపీడీఓ రా ముడు అన్నారు. సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ సరళ, ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోసేనాయక్, సుమంత్ ఉన్నారు.

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి వీఆర్వోలను ఆదేశించారు. సోమవారం ఆయన స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్,హౌసింగ్ డీఈఈలు ఏడుకొండలు, వాసుదేవరావు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి పెంపు

- కూలీలకు రోజువారీ వేతనం పెంచిన ప్రభుత్వం
- 257 నుంచి రూ.272కు పెంపు
- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు



కోడుమూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోడుమూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రభుత్వం అండగా నిలబడుతోంది. ఏటేటా గరిష్టంగా చెల్లిస్తున్న రోజువారీ కూలి పెంచుతూ వస్తోంది. 2022- 23లో రూ. 245 నుంచి రూ. 257కు పెంచిన సర్కారు ఈ ఏడాది మరో రూ. 15 పెంచింది. అంటే ప్రస్తుతమిస్తున్న రోజువారీ కూలి రూ. 257ను రూ. 272 చేసింది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన ఈ వేతనం 2024 మార్చి 31 వరకు కొనసాగుతోంది. ప్రస్తుత వేసవిలో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని 925 గ్రామ పంచాయతీల్లో డకౌట్లు, ఫీల్డ్ ఛానల్స్, నీటి సంరక్షణ పనులు, కాలువలు, చెక్‌డ్యాంలలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ రూ.18 కోట్లు మంజూరు కాగా 89 లక్షల పని దినలు కల్పించాని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పనిదినాలతో పాటు వేతనాలు పెరగడంతో కూలీలకు మరింత ఆర్థిక భరోసా లభించింది. కర్నూలు జిల్లాలో 3.46 లక్షల జాబ్ కార్డులుండగా ఇందులో దాదాపు 75 వేల మంది రోజు ఉపాధి పనులకు వస్తున్నారు.

ఆధార్‌కు జాబ్ కార్డు అనుసంధానం

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఆధార్‌కార్డును జాబ్‌కార్డుకు అనుసంధానం చేసింది. గతంలో పనికి వెళ్లకపోయినా బోగస్ మస్టర్లు వేసి ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది వేతనాలు స్వాహా చేసేవారు. ఈ విధానానికి అడ్డుకట్ట వేయడం కోసం సర్కారు అధార్ అనుసంధానానికి శ్రీకారం చుట్టింది. పనికి వచ్చిన ప్రతి ఒక్కరి ఫొటోను సిబ్బంది తీసి ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా చేయడం ద్వారా పనుల్లో పారదర్శకత పెరగడంతో పాటు పనికి వెళ్లిన ప్రతి ఒక్కరికీ గిట్టుబాటు వేతనం దక్కుతోంది.

పెరిగిన వేతనం ఆసరా అవుతోంది



రోజు వారీ కూలి పెంచడం ఆనందంగా ఉంది. రూ.15 పెంపుతో కుటుంబంలో నలుగురు పనికి వెళ్తే రోజూ అదనంగా రూ.60 వస్తోంది. ప్రసుతం అధికారులు చూపించిన కొలతల మేరకు పనిచేస్తే ఒక్కొక్కరికీ రూ.257 వేతనం వస్తోంది. ఇప్పుడు ఈ మొత్తాన్ని 272 చేయడంతో మాకు మరింత ఆసరా అవుతోంది.

– గోవిందమ్మ, సి.బెళగల్

ఏప్రిల్ 1వ తేదీ నుంచే అమలు

ఏప్రిల్ 1వ తేదీ నుంచి రోజువారీ కూలిని ప్రభుత్వం పెంచింది. ఈ ఏడాది అదనంగా రూ.15 ఇస్తుంది. ప్రస్తుతం ఉపాధిహామీ పనులు చేసే వారికి కనీస వేతనం రూ.252 వస్తోంది. పెరిగిన వేతనంతో రూ.272 వస్తోంది. పనికి వెళ్లిన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేసుకొని నిర్ణయించిన పనిని పూర్తి చేస్తే గరిష్ట వేతనం లభిస్తోంది.

– రమాదేవి, ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్

కోడుమూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు

కోడుమూరు: కోడుమూరు ఎస్‌ఐగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న విష్ణు నారాయణను వీఆర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో కర్నూలు త్రీటౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి

కల్లూరు: నగరంలోని మట్టి పని అడ్డాల్లో చలువ పందిళ్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షుడు కె.సుధాకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు సూర్యనారాయణ భవనంలో శరీన్‌నగర్ మట్టి పని అడ్డా మేస్త్రీల సమావేశం నగర ఉపాధ్యక్షుడు ఏసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతుందన్నారు. కూలీలు ఇబ్బంది పడకుండా అడ్డాల్లో నిలువ నీడ కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, కృష్ణ, దాసు, వెంకటస్వామి, సరోజమ్మ, అయ్యస్వామి, శేషమ్మ, మరియమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా 'జగనన్నే మా భవిష్యత్తు'

సి.బెళగల్:కొండాపురం గ్రామలో జేసీఎస్ సీటీల సిరెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు శంకర్‌రెడ్డి, గ్రామ పెద్ద ఆనందం తదితరులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండల కేంద్రం సి.బెళగల్‌తో పాటు కంబదహాల్, బ్రాహ్మణదొడ్డి, పోలకల్ గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల గురించి వివరించి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు.

కల్లూరు:మన అందరి భవిష్యత్‌ను తీరిదిద్ద గల నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కల్లూరు మండల వైస్ ఎంపీపీ-2 చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్‌లో వార్డులో, గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించి, 82960 82960 నెంబర్‌కు మిస్డ్‌కాల్ చెయించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేష్ గౌడ్, రాజు, హుస్సేన్ ఆలం, సచివాల కన్వీనర్ భూ పాల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు ఇంటింటిని సందర్శిస్తున్నారు. ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరించి ప్రజా మద్దతు పుస్తకంలో నమోదు చేస్తున్నారు. గడిగరేవులలో సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించి లబ్ధిదారుల ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జక్కుల సావిత్రి, గడిగరేవుల ఉపసర్పంచ్ గోదా ప్రసాద్, మాజీ చైర్మన్ గోపాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్
- పంచలింగాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



దేవమాడలో పొదుపు మహిళలతో సమావేశమైన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికి సంక్షేమ ఫలాలు చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పార్టీ నాయకులు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మంచినీటి పైపులో పురుగులు వస్తున్నాయని స్థానిక మహిళలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సీపీడబ్ల్యూ స్కీం నుంచి వచ్చే నీటిని క్షుణ్ణంగా పరిశీలించి పైప్‌లైన్‌ను మార్చి మంచినీటిని సరఫరా చేయాలని ఎంపీడీఓ భాస్కర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి బషీరున్‌బీని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి అధికారం వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా ఉన్నానని చెబుతున్న చంద్రబాబు అర్హులకు ఒక్క ఇంటి స్థలం ఇచ్చిన పాపానపోలేదని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పథకాల కోసం జన్మభూమి కమిటీ నాయకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు వస్తున్నాయన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 95 శాతం పైగా నెరవేర్చామని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ విద్యాసాగర్, ఎంపీటీసీ రామ్‌నాథ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌నాయుడు, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ రవి మోహన్‌రెడ్డి, ఏఈఓ మోహన్‌రెడ్డి, ఏపీఓ మహమ్మద్‌బాషా, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామేశ్వరి, పొదుపు సంఘాల మహిళలు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగనన్నే మళ్లీ సీఎం

ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డినే రెండోసారి కూడా సీఎం అవుతారని, ఇది ప్రజల నమ్మకమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు మండల పరిధిలోని దేవమాడ గ్రామంలో సోమవారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాల గురించి వివరించి గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అంతకు ముందు గ్రామంలోని పొదుపు మహిళలతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు ధర్మవరం వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు కృష్ణవేణి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వాసు, సచివాలయ కన్వీనర్ గోపాల్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రాగమయూరిలో పట్టపగలే చోరీ

- 20 తులాల బంగారు నగలు, రూ.10 వేలు నగదు అపహరణ



బీరువాను తెరిచిన దృశ్యం

ఓర్వకల్లు: నన్నూరు గ్రామ శివారులోని రాగమయూరి గ్రీన్‌హిల్స్‌లో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన శ్రీనివాసులు, భార్య రామలక్ష్మి రాగమయూరిలోని 21వ లైన్‌లోని 444 నంబర్ గల ఇంటిలో నివాసముంటున్నారు. శ్రీనివాసులు ఇటీవలే కర్నూలు నగరంలోని రేడియో స్టేషన్‌లో ఉద్యోగం చేస్తూ స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. శ్రీనివాసులు భార్య రామలక్ష్మి నంద్యాల పరిధిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం స్థానిక టోల్‌గేట్ వద్ద భార్యను వదిలి బంధువును పరామర్శించేందుకు శ్రీనివాసులు కర్నూలుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరపడ్డారు. బీరువాలో ఉన్న 20 తులాల బంగారు నగలు, రూ.10 వేల నగదును దోచుకెళ్లారు. భార్యాభర్తలు ఇద్దరు సాయంత్రం ఇంటికి వచ్చి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఎస్‌ఐ మల్లికార్జున, కర్నూలు రూరల్ సీఐ శ్రీనివాసులురెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయనున్నట్లు సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోడుమూరు రూరల్: బైక్, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. కోడుమూరు-కర్నూలు రహదారిలో కొత్తూరు గ్రామ సమీపంలో ఈ దుర్ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఆస్పరి మండలంలోని హరిగెర గ్రామానికి చెందిన వీరన్న కుమారుడు శ్రీనివాసులు(37) హైదరాబాద్‌లో పని చేసుకుంటూ అక్కడే నివాసముంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన శ్రీనివాసులు తిరిగి హైదరాబాద్‌కు బైక్‌పై వెళుతుండగా కొత్తూరు సమీపంలో కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను కోడుమూరు సీఐ శ్రీధర్ తన సిబ్బందితో కలిసి పట్టణంలో అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి

సి.బెళగల్: మండలంలోని సంగాల గ్రామంలో విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మల్లికార్జున సోమవారం ఉదయం తనకున్న 15 పశువులను మేపుకోసం పొరుగు గ్రామామైన తిమ్మందొడ్డి పొలాల్లోకి తీసుకెళ్లాడు. మేపు అనంతరం సాయంకాలం తిరుగు ప్రయాణంలో వ్యవసాయ బోర్‌కు ఉన్న విద్యుత్ తీగలు పశువులకు తగిలాయి. ఈ ప్రమాదంలో మూడు ఆవులు అక్కడికి అక్కడే మృతి చెందాయి. మరో ఆవు స్వల్పంగా గాయపడి ప్రమాదం నుంచి తప్పించుకుందని మల్లికార్జున తెలిపారు. ఒక్కో ఆవు దాదాపు రూ.45 వేలు విలువ చేస్తుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

•ఠారెత్తిస్తున్న ఎండలు



సోమవారం మధ్యాహ్నం పాణ్యంలో నిర్మానుష్యంగా జాతీయ రహదారి

పాణ్యం: ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి ఉక్కపోత మొదలవుతోంది. సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువ నమోదవుతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. పాణ్యంలో సోమవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. ఎండల్లో వివిధ పనుల నిమిత్తం స్కూటర్లపై వెళ్లే వారు మార్గమధ్యంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే 18వ నంబర్ జాతీయ రహదారి ఎండల ప్రభావంతో మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించింది. కాగా అత్యవసర పనులు ఉంటే తప్పా బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు ఎండల్లో తిరిగితే వడదెబ్బ సోకే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

16న తెలుగు నాటక రంగ వేడుకలు

కర్నూలు కల్చరల్: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఈనెల 16వతేదీన తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. 14 నుంచి 15వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 14,15 తేదీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నాటక రంగ సంస్థలకు ఏకాంకము పద్య పోటీలు జరుగుతాయని తెలిపారు. 14వ తేదీ రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ రాయబారం, కర్ణ రహస్యము, సుభద్రా రాయబారం, గయోపాఖ్యానం, తులా భారం, అలక సీను, 15న మాయల మరాఠీ, గయపాఖ్యానం, సత్య హరిశ్చంద్ర కాటి సీను ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 16వ తేదీ సాయంత్రం 7 గంటలకు టీజీవీ కళాక్షేత్రం కళాకారులతో శ్రీకృష్ణ కర్ణార్జునీయం పద్యనాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాటక రంగంలో విశేష సేవలు అందించిన కళాకారులకు పురస్కారాలు ప్రదానం చేయడంతో పాటు 14, 15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



నృత్యం చేస్తున్న రేణుశ్రీ



సాధించిన మెమొంటోలు, సర్టిఫికెట్లతో రేణుశ్రీ

గజ్జె కట్టి.. భళా అనిపించి

- కూచిపూడి నాట్యంలో రాణిస్తున్న రేణుశ్రీ
- వందలకు పైగా ప్రదర్శనలు.. ప్రముఖుల ప్రశంసలు
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు
- గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు

కర్నూలు కల్చరల్: చిన్న వయస్సులోనే కాళ్లకు గజ్జెలు కట్టింది. నాట్యమయూరిలా నృత్యం చేస్తూ వందల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చింది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు సొంతం చేసుకుంది. చదువుతో పాటు సంప్రదాయ నృత్యం కూచిపూడిలో రాణిస్తున్న రేణుశ్రీ విజయ గాథ ఇది.

కర్నూలు సీతారామనగర్‌కు చెందిన రేణుశ్రీ స్థానిక సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) తృతీయ సంవత్సరం చదువుతోంది. తల్లి జయంతి గృహిణి. తండ్రి నాగరాజు కిరాణం దుకాణం నిర్వహిస్తున్నారు. చిన్నప్పుడు రేణుశ్రీ బుడిబుడి అడుగుల్లో ఏదో తెలియని కొత్తదనం కనిపించింది తల్లిదండ్రులకు. మంచి నృత్య కారిణిగా తీర్చిదిద్దాలని భావించి ఏడేళ్ల వయస్సులో నృత్యజ్యోతి డ్యాన్స్ అకాడమీలో చేర్పించారు. నృత్య శిక్షకులు డాక్టర్ కె.వి. భార్గవ్‌కుమార్ దగ్గర శిక్షణ ఇప్పించారు. అనతి కాలంలోనే శిక్షణ పూర్తి చేసుకుని చదువుతో పాటు నృత్యంలో రాణించడం మొదలు పెట్టింది. గత 13 ఏళ్లుగా జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయిలో వందల ప్రదర్శనలు ఇచ్చి ఎందరో మన్ననలు అందుకుంది. నేటికీ అందుకుంటోంది. ఇప్పటికే నృత్య ప్రియ అవార్డును సొంత చేసుకోవడంతో పాటు కూచిపూడి నృత్యంలో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేసింది. మంచి నృత్య కారిణిగా, నృత్య శిక్షకురాలుగా మరింత ఉన్నతంగా రాణించడమే తన లక్ష్యమని చెబుతోంది రేణుశ్రీ.

ప్రతిభా పాటవాలు..

- కూచిపూడి నృత్యంలో రెండు సంవత్సరాల ప్రారంభిక, మూడు సంవత్సరాల భూషన్, రెండు సంవత్సరాల విశారద కోర్సులను పూర్తి చేసి డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణత సాధించారు.
- రాజస్థాన్, సిక్కిం, గుజరాత్ రాష్ట్రాల వద్ద ఇండియా పాకిస్థాన్, ఇండియా చైనా బార్డర్స్‌కు వెళ్లి అక్కడ సైనికులతో రక్షాబంధన్‌ను జరుపుకుని నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- ఢిల్లీ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.
- పాల్గొన్న ప్రతి పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు ఎందరో ప్రశంసలు అందుకున్నారు.
- ఎస్వీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ ప్రతి సంవత్సరం నిర్వహించే జాతీయ సాంస్కృతిక మేళాలో పలుమార్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.
- 2012, 2014, 2016 సంవత్సరాల్లో సిలికాన్ ఆంధ్ర వారు నిర్వహించిన నృత్యోత్సవ్‌లో సత్తా చాటడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది.
- 2018 సంవత్సరంలో నృత్య జ్యోతి అకాడమీ వారు నృత్య ప్రియ అవార్డును ప్రదానం చేశారు.
- 2023లో మానవత సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌తో సన్మానం అందుకున్నారు.
- 2023లో జిల్లా యువజన శాఖ నిర్వహించిన పోటీల్లో ద్వితీయ స్థానంలో అవార్డు అందుకుంది.